

ఐచర్, ప్రయివేటు బస్సు ఢీ... ఒకరు మృతి

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని దామాజిపల్లి వద్దగల 44వ జాతీయ రహదారిపై ఐచర్ వాహనాన్ని జబ్బర్ ట్రావెల్ ప్రైవేట్ బస్సు ఢీ కొని బోల్తా పడింది. మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మరో ఎనిమిది మందికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. బెంగళూరు నుండి హైదరాబాద్ వెళ్తున్న జబ్బర్ ట్రావెల్ బస్సు (ఎన్‌ఎల్ 01 బి 3388) మంగళవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో చెన్నేకొత్తపల్లి మండలంలోని దామాజిపల్లి సమీపంలో 44వ జాతీయరహదారిపై ఐచర్ వాహనాన్ని ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సుర్జిత్(30) అనే మహిళ మృతిచెందింది. మరో 8 మందికి గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను చెన్నేకొత్తపల్లి హాస్పిటల్‌కు తీవ్ర గాయాలు అయిన వారిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



తాడిపత్రి జూనియర్ కళాశాల ఆవరణలోని మైదానంలో నిలిచిన వర్షపునీటిని చూపుతున్ననాయకులు

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - తాడిపత్రి, గుత్తి

విద్యారంగ సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిరి, ఓతూరు పరమేష్ విమర్శించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకోవటానికి చేపట్టిన ఎస్‌ఎఫ్‌ఐ జీపుయాత్ర రెండో రోజు మంగళవారం తాడిపత్రి నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ జూనియర్ కళాశాలలో భోజనశాల ఏర్పాటు చేయాలన్నారు.కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుకూలంగా టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో భాగంగా ఎస్సీ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో టిఫిన్‌ను పరిశీలించారు. అక్కడ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. అక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాత్రిపూట చిన్నపాటి వర్షానికి క్రీడా మైదానం చిన్నపాటి చెరువు లాగా మారిపోవటాన్ని గమనించిన నాయకులు అదే నీటిలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ఓ వైపు హామీలు ఇస్తూ మైదానాలను మాత్రం అభివృద్ధి చేయడం లేదని విమర్శించారు. అనంతరం జేకేజీవీ సందర్శించి అక్కడ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జెకెజివికి ప్రహరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శులు భీమేష్, వంశీ, శివ, జిల్లా నాయకులు విజయ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : రాష్ట్రంలో నెలకొన్న విద్యా సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, అధ్యక్షుడు తరిమెల గిరి, రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ విమర్శించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు యాత్ర మంగళవారం గుత్తికి చేరుకుంది. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి మద్యంపై ఉన్న శ్రద్ధ నాణ్యమైన విద్యపై లేదన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థినులపై లైంగిక దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు,కళాశాలల్లో భోజనశాలలు కరువయ్యాయన్నారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌లకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామన్నారు. పోరాటాలకు విద్యార్థులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో విద్యార్థులు రాణించాలని చెప్పే ప్రభుత్వం అనేక పాఠశాలలు, కళాశాలల్లో క్రీడా మైదానాలు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. పిడి, పిఈటి పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గుత్తి బాలికల కళాశాలకు అనుబంధంగా ఉన్న బిసి సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహానికి అదనపు గదులు నిర్మించాలని డిమాండ్ చేశారు. గుత్తిలో బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. జీపు యాత్ర ఏడో తేదీ ముగింపు అనంతరం యాత్రలో పరిశీలనలో వచ్చిన సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శులు నవీన్ యాదవ్, భీమేష్, వంశీ, శివ, గుత్తి మండల అధ్యక్షుడు బాలాజీ, నాయకులు విజయ్, జవర్ధన్, ఓము, జనార్ధన్ చరణ్, అశోక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అక్రమార్కుల కల్పవృక్షం 'పురం' మున్సిపల్ మార్కెట్



అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పూలవ్యాపారం



అద్దె చెల్లించి ఎండలో వ్యాపారం చేస్తున్న కూరగాయల వ్యాపారులు

అనుమతులు లేకుండా అండర్ గ్రౌండ్ స్థలం అప్పగింత

పురపాలక సంఘం ఆదాయానికి గండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం ఆధర్యంలో నిర్మించిన వాణిజ్య సముదాయ భవనం, కూరగాయాల మార్కెట్ అక్రమార్కులకు కల్పవృక్షంగా మారింది. ఇక్కడ ఒక్కోక్కరికి ఒక్కో విధంగా గదులు, స్థలాలను కేటాయించారు. దీంతో పురపాలక సంఘానికి రావాల్సిన లక్షల రూపాయల ఆదాయానికి గండి పడింది. స్థలాల కేటాయింపులో మున్సిపల్ రెవిన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఒకరిపై ఒకరు నెపం వేసుకుని చేతులు దులుపుకుంటున్నారు. దీంతో పురపాలక సంఘానికి రావాల్సిన ఆదాయం కాస్తా పాలకులు, అధికారుల జేబుల్లోకి వెళుతోంది.

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని హిందూపురం పురపాలక సంఘానికి సెలక్షన్ గ్రేడ్ ఉంది. ఇక్కడ పురపాలక సంఘ ఆధీనంలో ఉన్న కూరగాయల మార్కెట్ శిథలం అయిందని గతంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నా సమయంలో పడగొట్టారు. అదే స్థలంలో కూరగాయల మార్కెట్ తో పాటు వాణిజ్య సముదాయ భవనం నిర్మాణం చేశారు. వాణిజ్య సముదాయ భవనాలను బహిరంగ వేలం వేశారు. అయితే వేలంలో దక్కించుకున్న వారు ఇంత వరకు పూర్తి స్థాయిలో వ్యాపారాలను ప్రారంభించలేదు. ఇక పోతే కూరగాయాల మార్కెట్ బహిరంగ వేలంలో పాలకులు, అధికారులు కలిసి ఆ సమయంలో భారీ అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. ఏకంగా ఒక కౌన్సిలర్ కు రూ. 1.35 లక్షలు, ఇక వైస్ చైర్మన్లకు రూ. 3 లక్షలు, ఛైర్‌పర్సన్ కు రూ. 5లక్షలు, మున్సిపల్ అధికారులకు ఏకంగా రూ. 10 లక్షలు కూరగాయాల వ్యాపారులు ఇచ్చినట్లు ఆరోపణలు వినపిస్తున్నాయి. దీంతో తూతూ మంత్రంగా బహిరంగ వేలం నిర్వహించి గదులను అప్పగించారన్న విమర్శలున్నాయి. అయితే వ్యాపారులు గదుల్లో వ్యాపారం చేయకుండా గదుల బయట వ్యాపారాలు చేస్తుండడంతో మార్కెట్ మొత్తం ఇరుకుగా మారింది. అదే సమయంలో మార్కెట్ ఆవరణంలో ఉన్న ఖాళీ స్థలంలో ఆకు కూరల వ్యాపారులకు 16 చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించారు. దీని కోసం ఆ సమయంలో పురపాలక సంఘానికి డిపాజిట్ చెల్లించాలన్న పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ. 30 వేల నుంచి 50వేల రూపాయల వరకు మార్కెట్ అసోసియేషన్ వారు వసూలు చేశారని తెలుస్తోంది. ఇందులో పురపాలక సంఘానికి రూ.5వేలు చెల్లించి, మిగిలిన డబ్బులను పాలకులు, అధికారులు వాటలు వేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో పాటు నెలకు వ్యాపారులు రూ.500 వరకు అద్దెలు సైతం చెల్లిస్తున్నారు. ఇది చాలదన్నట్లు చివరకు వాణిజ్య సముదాయ భవనాలను అద్దెలకు తీసుకున్న వారు వారి సొంత ఆస్థుల తరహాలో గదులను వారికి ఇష్టం వచ్చినట్లు షెట్టర్‌లను ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయం తెలిసినప్పటికి మున్సిపల్ అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు. వాణిజ్య సముదాయ భవనాలు, కూరగాయల మార్కెట్ అండర్ గ్రౌండ్ స్థలాన్ని పూల వ్యాపారులకు ధారదత్తం చేశారు. దీనికి మున్సిపల్ శాఖ అనుసరించాల్సిన కనీస నిబంధనలు సైతం అధికారులు పాటించ లేదన్న ఆరోపణలు వినపిస్తున్నాయి. తొలి నుంచి కూరగాయల వ్యాపారుల నుంచి ఆకు కూరల వ్యాపారులు, పూల వ్యాపారుల వరకు కేటాయించిన స్థలాలపై ప్రత్యేక అధికారులతో విచారణ చేయిస్తే పెద్ద అవినీతి బయటపడడమే కాకుండా మున్సిపాల్టీకి ఆదాయం సైతం పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీనిపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలని పుర ప్రజలు కోరుతున్నారు.

గుట్టు చప్పుడు కాకుండా కేటాయింపులు

వానిజ్య సముదాయ భవనం, కూరగాయల మార్కెట్ అండర్ గ్రౌండ్ లో ఉన్న ఖాళీ స్థలాన్ని 99 మంది చిరు వ్యాపారులకు కేటాయించేలా 2022 వ సంవత్సరం నవంబర్ 30న జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఆ తీర్మానం అనుసరించి చిరు వ్యాపారులకు కేటాయించాలి. దీని కోసం 64 చదరపు అడుగుల స్థలానికి డిపాజిట్ రూ.5వేలు, నెలకు అద్దె రూ.750, 150 చదరపు అడుగుల స్థలానికి డిపాజిట్ రూ.7,500, నెలకు అద్దె రూ. 1250లుగా నిర్ణయించారు. అయితే ఈ స్థలాన్ని చిరు వ్యాపారులకు కాకుండా 25 మంది హోల్ సేల్ పూల వ్యాపారులకు గత సంవత్సరం జనవరి 10న గుట్టుచప్పుడు కాకుండా లాటరీ విధానం ద్వారా కేటాయించడానికి ఎంపిక చేశారు. దీనికి ప్రతిఫలంగా పూల వ్యాపారులు పాలక వర్గానికి లక్షల రూపాయల్లో మాముళ్ల ఇచ్చే విధంగా రహస్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలున్నాయి. అయితే పంపకాల్లో బేరం కుదరక పోవడంతో ఈ అంశం ఇప్పటి వరకు జరిగిన కౌన్సిల్ సమావేశాల్లో చర్చకు రాలేదని తెలుస్తోంది. దాదాపు 20 నెలల నుంచి ఎటువంటి డిపాజిట్, అద్దెలు చెల్లించకుండానే పూల వ్యాపారులు మున్సిపల్ మార్కెట్ అండర్ గ్రౌండ్ స్థలంలో వారి వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కనీస చర్యలు సైతం తీసుకోవడం లేదు. నిర్ణయించిన అద్దెలు వసూలు చేస్తున్నారా...?, వసూలు చేస్తుంటే ఎవరి ఖాతాలోకి వెళుతున్నాయన్నది అర్థం కావడం లేదు.

పైసా చెల్లించరు...సేవలు చేయాల్సిందే

పురపాలక సంఘ వ్యాప్తంగా వాణిజ్య సముదాయాల నుంచి చెత్తను సేకరిస్తే ప్రతి నెల వారి నుంచి యూజర్ చార్జీలను వసూలు చేస్తారు. అయితే ఇప్పటి వరకు పూల వ్యాపారులు పురపాలక సంఘానికి పైసా కూడా అద్దె చెల్లించ లేదు. అయినప్పటికి మార్కెట్‌లో వారు వేస్తున్న చెత్తను పారిశుధ్య కార్మికులు శుభ్రం చేసి, చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. దీని కోసం పురపాలక సంఘానికి ప్రతి నెల అదనపు ఖర్చు అవుతోంది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

మున్సిపల్ కమిషనర్‌గా భాధ్యతలను స్వీకరించినప్పటి నుంచి వాణిజ్య సముదాయ భవనం, కూరగాయాల మార్కెట్ పై ప్రత్యేక దృష్టి సారించాను. పూల మార్కెట్ విషయం సైతం పరిశీలన చేసి, పూల వ్యాపారులకు స్థలాలను ఎప్పుడు కేటాయించారు. ఇతర విషయాలను సమగ్రంగా పరిశీలన చేసి, నిబంధనల మేరకు చర్యలు తీసుకొంటాం.

మల్లికార్జున,
మున్సిపల్ కమిషనర్

పాఠశాలలో చోరీ డ్రామా..!?

దొంగతనం జరగకుండానే ఫిర్యాదు

రెండు గ్రూపుల మధ్య వివాదం నేపథ్యంలో చోరీ డ్రామా

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి సమయంలో చోరీ జరిగిందంటూ ఓ హైడ్రామా నాటకం నడిచినట్లు తెలుస్తోంది. పాఠశాలలో చోరీ జరగిదంటూ వాచ్‌మెన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామాంజనేయరెడ్డి తన సిబ్బందితో పాఠశాలలను సందర్శించారు. 6,7తరగతి గదులను పరిశీలించి అక్కడున్న వారితో వివరాలు సేకరించారు. ఈ పరిశీలనలో అక్కడ ఎలాంటి దొంగతనం జరిగినప ఆనవాళ్లు లభించనట్లు తెలుస్తోంది.

ఓ గ్రూపుపై నెట్టే ప్రయత్నమా..?

పాఠశాలలో దొంగతనం జరగకున్నా జరిగినట్లు ఫిర్యాదు చేసి ఈ ఘటనను మండల కేంద్రంలోని ఓ గ్రూపుపై నెపం నెట్టే ప్రయత్నం జరిగిందే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇందుకు ఓ పోలీసు ముఖ్య అధికారి కూడా సహకారం అందించినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండల కేంద్రంలో రెండు గ్రూపుల మధ్య విభేదాలు పెద్ద ఎత్తున నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలలో చోరీ జరిగిందని ఓ గ్రూపు మరో గ్రూపుపై నెపం నెట్టేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. గతంలో యల్లనూరులో పని చేసిన ఓ పోలీసు అధికారి ప్రస్తుతం ఉన్నతాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈయన ఓవర్గానికి వత్తాసు పలుకుతూ ఘర్షణలకు తావిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా విన్పిస్తున్నాయి. గత నెలలో యల్లనూరు పాతపేట శివారు వడ్డె సామజిక కాలనీలో అప్పుల లావాదేవీల నేపథ్యంలో ఘర్షణ జరిగిన అంశంలో సదరు పోలీసు అధికారి సంబంధంలేని ఓ పాత్రికేయున్ని కేసులో ఇరికించే కుట్ర జరిగిందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

రైతుల పొలాల్లో దొంగతనాలు

మండలంలో ఇటీవల రైతుల పొలాల్లో కేబుల్ వైర్లు చోరీ అవుతున్నాయి. వీటిపై పోలీసు శాఖ నుంచి స్పందన నామమాత్రంగానే ఉంటోందంటూ విమర్శలు విన్పిస్తున్నాయి. వెన్నపూసపల్లి, యల్లనూరు, దుగ్గుపల్లి తదితర ప్రాంతాల్లో కేబుల్‌వైర్లు చోరీల జరుగినా నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలం అయ్యారనే భావన రైతుల్లో వ్యక్తం అవుతోంది. కొందరు స్థానిక పోలీసులు అయితే ఫిర్యాదు దారులతోనే డబ్బులు గుంజుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఎస్పీ స్పందించి సమస్యత్మక ప్రాంతమైన యల్లనూరుపై ప్రత్యేక దృష్టి సారించి పోలీసు శాఖను చక్కదిద్దే ప్రయత్నం చేయాలని పలువురు కోరుతున్నారు.

స్కూల్ అసిస్టెంట్‌పై వేటు

ప్రజాశక్తి అనంతపురం సిటీ

స్కూల్ అసిస్టెంట్ సుధాకర్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈవో ప్రసాద్ బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వజ్రకరూరు మండల పరిధిలోని వెంకటాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సుధాకర్ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లుగా ఆరోపణలు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో ఎంఇఒ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆయన్ను సస్పెండ్ చేసినట్లు డీఈవో తెలిపారు.

జెడిఎను కలిసిన ఎంపిఇఒ సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం



జెడిఎతో ఎంపిఇఒ సంఘం నాయకులు

జిల్లా వ్యవసాయ అధికారి యు.ఉమామహేశ్వరమ్మను నూతనంగా ఏర్పడిన అనంతపురం జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నాయకులు మంగళవారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు బ్యాళ్ల మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి గుమ్మడం ఆదినారాయణ, కోశాధికారి కోశాధికారి పి.శ్వేత వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం స్టేట్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ సుజిత, జాయింట్ సెక్రెటరీ భాగ్యశ్రీ, కార్యవర్గ సభ్యులు అక్కమ్మ, నగేష్, ఆంజనేయులు, రాము, పవన్ కుమార్ పాల్గొన్నారు.

హెచ్‌ఎల్‌సికి జనవరి దాకా సాగు, తాగునీరు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

హెచ్‌ఎల్‌సికి జనవరి దాకా సాగు, తాగునీరు వస్తాయని సూపరింటెండెంట్ ఇంజినీర్ సుధాకర్‌రావు తెలిపారు. తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువపై 116 కిలోమీటర్ వద్ద రెగ్యులేటర్ అడ్డుగోడ కూలిపోగా మంగళవారం ఆయన ఈఈ పార్థసారథి, కణేకల్లు సెక్షన్ డీఈ దివాకర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఎస్ఈ మాట్లాడుతూ తుంగభద్ర జలాశయం నుంచి హెచ్‌ఎల్‌సికి ఇప్పటివరకూ 18 టిఎంసిల నీరు ఇచ్చారని, మిగిలిన 6 టిఎంసిలు జనవరి మొదటి వారం వరకూ ఇస్తారని తెలిపారు. కాలువపై రెగ్యులేటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, కల్వర్టులు నిర్మించి 50 ఏళ్లకు పైగా కావడంతో కొన్ని శిథిలావస్థకు చేరాయని వాటి మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జిల్లాలో గతంలో 140 మంది లస్కర్లు ఉండేవారని ప్రస్తుతం 28 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం ఆంధ్ర-కర్నాటక సరిహద్దులో 105వ కిలోమీటర్ల వద్ద 1500 క్యూసెక్కుల నీరు ఆంధ్రాలో చేరుతుందన్నారు. చిన్న నీటి డిస్ట్రిబ్యూటర్లు, మండలంలో అతిపెద్దవైన 1, 9వ డిస్ట్రిబ్యూటర్లు శిథిలావస్థకు చేరాయని మరమ్మతులు చేయాలని సాగునీటి సంఘం అధ్యక్షులు హనుమంతప్ప, నటరాజ్, రాజా రమేష్, చిన్న డిస్ట్రిబ్యూటర్ల ఆయకట్టు రైతులు, సర్పంచులు విజ్ఞప్తి చేశారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయండి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని కెవిఎస్ గిరిప్రసాద్ కాలనీ వాసులు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో కాలనీవాసులకు పట్టాలు ఇచ్చే ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో, కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంపీపీ దాసరి సునీత, పొడరాళ్ళ రవీంద్ర, ఓబుళపతి, తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎంపీడీవో సల్మాన్, డిప్యూటీ ఎంపీడీవో సదాశివ, ఇంజనీర్లు మద్దిలేటి, నాగేంద్ర ఎంఈఓ లింగా నాయక్, ఏపీఎం అనితాదేవి, ఏపీవో సుజాత, బుక్కరాయసముద్రం పంచాయతీ కార్యదర్శి పెద్ద శ్రీనివాసులు, సిఐ పుల్లయ్య, ఎస్ఐ రాంప్రసాద్, పాల్గొన్నారు.

కరువు జాబితాలో జిల్లాకు అన్యాయం

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



విలేకర్లతో మాట్లాడుతున్న అనంతవెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

కూటమి ప్రభుత్వం జిల్లా రైతాంగాన్ని మరోసారి దగా చేసిందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. కరువు మండలాల ప్రకటనలో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగింద న్నారు. నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం అనంత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పెద్దఎత్తున నష్టపోయినా ప్రభుత్వం ఆదుకోలేద న్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లోనైనా ఆదుకుంటారనుకుంటే మొండిచేయి చూపారన్నారు. జిల్లాలో అన్ని పంటలు కలిపి సాధారణ సాగు విస్తీర్ణం 8.50 లక్షల ఎకరాలు ఉంటే ఖరీఫ్‌లో 7.50 లక్షల ఎకరాల్లో సాగు చేశారన్నారు. 2 నెలల పాటు జిల్లాలో ఎక్కడా వర్షాలు కురవలేదన్నారు. ఫలితంగా పంటలు ఎండిపోయాయన్నారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 7 మండలాల్లో తీవ్ర వర్షాభా వం, 17 మండలాల్లో వర్షాభావం, 7 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని తెలిపారు. ఖరీఫ్‌లో కేవలం ఒక నెల(ఆగస్టు)లో అధిక వర్షం వచ్చిందన్న కారణంతో సీజన్ మొత్తాన్ని సాధారణ వర్షపాతంగా చూపి కరువు మండలాలు ప్రకటించారా? అని ప్రశ్నించారు. కరువు మండలాల జాబితాపై ఇప్పటికీ ఒక్కరూ స్పందించలేదన్నారు. జిల్లాలో ప్రజాప్రతినిధులు సొంత ఆదాయ వన రులు పెంచుకోవడమే పనిగా పెట్టుకున్నారని, రైతుల కష్టాలు పట్టడం లేదని మండిపడ్డారు. రబీ సీజన్‌కు సంబంధించి సబ్సిడీ పప్పుశనగ విత్తనం పంపిణీలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ధ్వజమెత్తారు. ఇటీవల సిఎం చంద్రబాబు శ్రీసత్యసాయి జిల్లాకు వచ్చిన సమయంలో జిల్లా ప్రజాప్రతి నిధులు ఎందుకు అడగలేకపోయారన్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు కళ్లు తెరవాలని, పున్ణసమీక్ష చేసి కరువు మండలాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ తక్షణం అధికారులతో సమీక్ష చేసి నివేదిక పంపాలని కోరారు. జిల్లాలో కరువు పరిస్థితులను సిఎం చంద్రబాబు గుర్తించాలని కోరారు.

ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తూనే ఉంటా..

తాను ప్రజా సమస్యలపై మాట్లాడుతుంటే ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. చేతనైతే నా కంటే ఎక్కువ అభివృద్ధి చేసి చూపించు.. చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. మా పార్టీలో ఒకరిద్దరు కట్టప్పలతో కలిసి కుట్ర రాజకీయాలు చేస్తే దీటుగా ఎదుర్కొంటామన్నారు.

7,8 తేదీల్లో మంత్రి లోకేష్ పర్యటన

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, ఎంపీలు, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఈ నెల 7, 8 తేదీల్లో రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పట్టణంలో పర్యటిస్తారని, మంత్రి పర్యటన విజయవంతంగా సాగేలా అందరూ కృషి చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ జగదీష్ అధికారులను ఆదేశించారు. మంత్రి పర్యటనలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వారు మంగళవారం ఎంపీలు అంబికా లక్ష్మినారాయణ, పార్థసారథి, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, ఆర్డీవో వసంత బాబు, డీఎస్పీ రవిబాబు, ఆర్‌అండ్‌బి ఉన్నతాధికారులతో కలిసి మంత్రి పర్యటన స్థలాన్ని పరిశీలిం చారు. ముందుగా కనకదాసు విగ్రహావిష్కరణ ప్రాంతంలో ఏర్పాట్లను పరిశీలించారు.



మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

మంత్రికి గోళ్ల ఆంజనేయస్వామి గుడి వద్ద స్వాగతం పలికిన అనంతరం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో దళితులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వారి సమస్యలు వింటారన్నారు. టీ సర్కిల్‌లో ముస్లిం మైనార్టీలు స్వాగతం పలికిన అనంతరం వారితో ముచ్చటిస్తారు. గాంధీ సర్కిల్‌లో వ్యాపార వర్గాలు, వాల్మీకి సర్కిల్‌లో వాల్మీకులు స్వాగతం పలికి సన్మానిస్తారు. మంత్రి వాల్మీకి మహల్‌ను పరిశీలిస్తారు. అనంతరం శెట్టూరు రోడ్డులోని ప్రజావేదిక సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై టిడిపి కార్యకర్తలకు సన్మానం, మహిళలతో సమావేశాలు, నాయకులతో ముఖాముఖి లాంటి కార్యక్రమాలు వేర్వేరుగా నిర్వహిస్తారు. రాత్రికి అక్కడి బసచేస్తారు.

8న కనకదాసు విగ్రహావిష్కరణ

ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు మంత్రి కనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం అక్కడే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. మంత్రి పర్యటనపై ఎంపీలు, ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. సుమారు 40వేల మంది దాకా ప్రజలు వచ్చే అవకాశముందని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం సూచనల మేరకు మంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు ఉండకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ప్రజలకు తాగునీరు, భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా కనకదాసు విగ్రహావిష్కరణకు అందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. మంత్రి పర్యటన దృష్ట్యా ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. పట్టణంలో అంబేద్కర్ భవనం నిర్మిస్తామని, వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు 'మాంటిస్సోరీ' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-రాప్తాడు

మండలంలోని గొల్లపల్లి గ్రామం వద్ద ఉన్న మాంటిస్సోరీ ఎలైట్ స్కూల్ విద్యార్థి మంజునాథ్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సమీర, ఎండి కృష్ణభరత్, ప్రిన్సిపల్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంజునాథ్ మాంటిస్సోరీ ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల తూర్పుగోదావరి జిల్లా కోవూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మంజునాథ్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. మంజునాథ్‌ను కళాశాల ఇన్‌ఛార్జి మధు, ఇండియన్ వాలీబాల్ కెప్టెన్ కృష్ణమరాజు, కోచ్ టిప్పు సుల్తాన్ అభినందించారు.

7 నుంచి రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకూ నగర శివారులోని ఆర్‌డిటి స్టేడియంలో జరగనున్న 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలను విజయవంతం చేద్దామని కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. ఈ క్రీడల నిర్వహణపై మంగళవారం ఆర్డీటీ క్రీడా గ్రామంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకూ జరిగిన పనులపై ఆరా తీసిన కలెక్టర్ అన్ని పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీరు, భోజనం, విద్యుత్ సరఫరా, పారిశుధ్య పనులు, ప్రొటోకాల్, పోలీసు భద్రత, ట్రాఫిక్ మళ్లింపు, వివిధ జిల్లాల నుంచి వచ్చే వారికి రాత్రి బస, తదితర అంశాలపై సమీక్షించి పలు ఆదేశాలు, సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో తొలిసారి అనంతపురంలో పెద్దఎత్తున రెవెన్యూ క్రీడలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. నిర్వహణ ఏర్పాట్లలో అన్ని జాగ్రత్తలు చేపట్టాలని, ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకూడదని తెలిపారు. ఆయా శాఖల ఉమ్మడి జిల్లాల అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ప్రతిరోజూ సాయంత్రం జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో జిల్లా అధికారులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనాలని కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీసీఎల్‌ఏ జయలక్ష్మితో పాటు సిఎం చంద్రబాబు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఉమ్మడి జిల్లా మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించినట్లు తెలిపారు. అనంతరం సభా వేదిక, మైదానాలు, క్రీడాకారుల వసతి భోజన సదుపాయాల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. సమావేశంలో జెసి శివ్‌నారాయణ్‌శర్మ, డిఆర్‌ఒ మలోల, ఎఫ్ఎస్ఒ రామకృష్ణారెడ్డి, రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ సంఘం అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వెంకట రాజేష్, జిల్లా అధ్యక్షులు ఆర్యన్ దివాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు మధునాయక్, ప్రధాన కార్యదర్శి మైనుద్దీన్, జిల్లా రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక సంఘం అధ్యక్షులు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి హరినాథ్‌రెడ్డి, మహిళా సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం : కలెక్టర్



ఆర్డీటీ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

శాస్త్రీయ ఆలోచనలతోనే కొత్త ఆవిష్కరణలు

ఎస్‌కెయు రెక్టార్ జి.వెంకటనాయుడు

ప్రజాశక్తి-రాప్తాడు

శాస్త్రీయ ఆలోచనతోనే కొత్త ఆవిష్కరణలు సాధ్యమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకట నాయుడు తెలిపారు. మండలంలోని గొల్లపల్లి వద్ద గల మాంటిస్సోరీ ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం జన విజ్ఞాన వేదిక మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన మండల స్థాయి చెకుముకి సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే శాస్త్రీయంగా ఆలోచించడం అలవర్చుకోవాలని, సైన్స్ పట్ల ఆసక్తి కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరించారు. జెవివి రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులకు సృజనాత్మకత ఎంతో అవసరమని, అది వారిని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేర్చుతుందన్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీర్రాజు, ఉపాధ్యాయులు పక్కీరయ్య, పూజిత, విగ్నేష్, దశరథ్‌శేఖర్, కవిత, రజిని, నారాయణరెడ్డి, హంపాపురం హెచ్‌ఎం లక్ష్మిరెడ్డి, జెవివి మండల నాయకులు తిప్పేస్వామి, శాంతరాజు, పాల్గొన్నారు.



రాప్తాడు మాంటిస్సోరి పాఠశాలలో ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న రెక్టార్

జిల్లా స్థాయికి ఎంజెపి విద్యార్థులు

రాయదుర్గం : డి.హీరేహాల్ జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం అబ్దుల్ మునాఫ్ సమక్షంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలు నిర్వహించారు. అందులో ఎంజెపి గురుకుల ఉన్నత పాఠశాల విద్యార్థులు సంజన, బంధన, గగనశ్రీ ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జెవివి నాయకులు జగదీష్, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి హనుమంతప్ప, ఉపాధ్యాయులు రమేష్, తేజశ్విని, కేదారేశ్వరి, సురేఖ, వీణ, పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో సైన్స్ సంబరాలు నిర్వహించారు. ముందుగా హెచ్‌ఎం గంధం శ్రీనివాసులు, జెవివి జిల్లా అధ్యక్షులు చిత్తప్ప, సీనియర్ ఉపాధ్యాయులు త్రివిక్రమ్, చిత్తయ్య సైన్స్ ఉపాధ్యాయులు ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు.

విజేతలకు బహుమతులు అందజేత

గుత్తి : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జడ్పీ బాలికోన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, దయానంద గురుకుల విద్యార్థులు వరుసగా ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఎంఇఒ బి.రవినాయక్, హెచ్‌ఎం సుంకన్న, జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.రంగన్న బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెవివి జిల్లా మాజీ అధ్యక్షులు పి.వెంకటరామిరెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రామాంజనేయులు, రంగనాథ్, నాయ కులు శ్రీధర్‌గౌడ్, దేశాయి నాగరాజు, రామచంద్రుడు, ఖాజాబాషా, శామ్యూల్ ప్రతాప్, హంపిరెడ్డి, హనుమన్న, హెచ్‌ఎం ఓబుళరాజు, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద ఐరన్ ఓర్ గనుల సరిహద్దులపై సర్వే

ప్రజాశక్తి-డి.హీరేహాల్

మండలంలోని ఓబుళాపురం, సిద్దాపురం గ్రామాల పరిధిలో ఉన్న వివాదాస్పద ఐరన్ ఓర్ గనుల సరిహద్దులను గుర్తించి నివేదిక సమర్పించాలని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో సుప్రీంకోర్టు విశ్రాంత జడ్జి ప్రశాంత్‌దులియా అధ్యక్షతన ఆరుగురు కమిటీ సభ్యులు మంగళవారం ఈ ప్రాంతంలో పర్యటించి అధ్యాధునిక సాంకేతిక పరికరాలను ఉపయోగించి ఇనుప ఖనిజం గనుల సరిహద్దులపై సర్వే నిర్వహించారు. డ్రోన్ సహకారంతో సర్వే చేసి సరిహద్దుల వివాదానికి తీరదించనున్నట్లు ఆయా శాఖల అధికారులు తెలుపుతున్నారు. వివాదాస్పదమైన మైనింగ్ గనుల సరిహద్దులను పరిశీలించి టీం సభ్యులతో ఖచ్చితమైన నిర్ణయానికి వచ్చిన తరువాతనే నివేదికను సుప్రీంకోర్టుకు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సర్వేతోనైనా సమస్య పరిష్కారమై మైనింగ్ తవ్వకాలు జరిగితే ఉపాధి దొరుకుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వారి వెంట సర్వే ల్యాండ్ రికార్డ్స్ డిడి వై.జయరామ్, డిడి సూర్యారావు, డ్రోన్ టీం సర్వేయర్లు, గనులు భూగర్భ, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ ప్రేమ్‌చంద్

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రేమ్‌చంద్ సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని ఆవులదట్ల పశు వైద్యశాలను మంగళవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే రాయదుర్గం ప్రాంతీయ పశు వైద్యశాల, పశువ్యాధి నిర్ధారణ సిఏడిడిఎల్ ల్యాబ్‌ను పరిశీలించి మందుల నిల్వ, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి పశువైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట పశు వైద్యాధికారులు సూర్యనారాయణరెడ్డి, శిరీష, నవీన్‌కుమార్, సిఏడిడిఎల్ సిబ్బంది ఉన్నారు. అనంతరం జెడి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు.



ఎంపీ అంబికా, ఎమ్మెల్యే శ్రావణిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నసింగిల్‌విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రాజు

ఎంపీ, ఎమ్మెల్యేలకు సింగిల్‌విండో అధ్యక్షుడి కృతజ్ఞతలు

పుట్లూరు : మండలంలోని కడవకల్లు గ్రామానికి చెందిన గోవర్ధనరాజును పుట్లూరు సింగిల్‌విండో అధ్యక్షుని గా నియమించారు. దీంతో మంగళవారం ఆయన అనంతపురంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డిని వారి వారి కార్యాలయాల్లో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాతే శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఆయనతో పాటు సింగిల్‌విండో డైరెక్టర్లు శ్రీనాథ్‌చౌదరి, ఆంజనేయులు ఉన్నారు.

'ఎన్‌ఆర్ ఫర్టిలైజర్స్' లైసెన్స్ రద్దు

అనంతపురం : ఎన్‌ఆర్ ఫర్టిలైజర్స్ దుకా ణంలో అనధికారికంగా ఎరువుల విక్రయం, రైతులకు బిల్లులు ఇవ్వకపోవడాన్ని వ్యవసాయ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఎన్‌ఆర్ ఫర్టిలైజర్ ఎరువుల దుకాణం లైసెన్స్‌ను రద్దు చేశామని ఏడీ ఏజిఎం అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

తాడిపత్రిరూరల్ : తాడిపత్రి–పుట్లూరు మార్గంలోని రైల్వేగేట్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై మంగళ వారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతుడి వయసు 55–58 ఏళ్లు ఉండవచ్చునని తెలిపారు. మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బండ్లపల్లిలో అరటి చెట్లు నరికివేత

నార్పల : మండలంలోని బండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు రవీందర్‌రెడ్డి తోటలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 70 అరటి చెట్లను నరికి వేశారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సాగర్, తహశీల్దార్ అరుణకుమారి, పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించి నిందితుల కోసం గాలించారు. రైతు మాట్లాడుతూ తనకు ఎవరూ శత్రువులు లేరని, ఎవరు చేశారో తెలియడం లేదని వాపోయాడు. విషయం తెలియగానే టిడిపి నేత ఆకుల బాబు తోట వద్దకు చేరుకొని రైతును ఓదార్చారు. చెట్లను నరికిన వారిని గుర్తించి శిక్షించాలని పోలీసులను కోరారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి ఫోన్ ద్వారా విషయం తెలిపారు.

విలువలతో కూడిన విద్యనభ్యసించాలి : డిఇఒ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

విద్యార్థులు విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని డిఇఒ ప్రసాద్‌బాబు సూచించారు. డిఇఒ మంగళవారం పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం హెచ్‌ఎం గంధం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిఇఒ మాట్లాడారు. వినయంతో కూడిన విద్య మన భవిష్యత్తుకు పునాదిలాంటిదన్నారు. క్రమశిక్షణతో మెలిగి ఉన్నత చదువుల వైపు అడుగులు వేయాలన్నారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కోసం ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. హెచ్‌ఎం పని తీరును ప్రసంశించారు. కార్యక్రమంలో ఏఎంఒ మంజునాథ్, ఏఎస్‌ఒ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు త్రివిక్రమరావు, గోవిందరాజులు, చిత్తయ్య, ప్రసాద్, రాఘవేంద్ర, సత్యప్రసాద్, కిషోర్, శీన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

మూడేళ్ల బాలుడికి 'కిమ్స్'లో చికిత్స

ప్రాణాపాయస్థితి నుంచి కాపాడిన వైద్యులు

ప్రజాశక్తి-అనంతపురం

న్యుమోనియాతో పాటు పలు రకాల సమస్యలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న మూడేళ్ల బాలుడికి నగరంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రి వైద్యులు చికిత్సచేసి ప్రాణాలు కాపాడారు. ఆ వివరాలను కన్సల్టెంట్ పీడియాట్రీషియన్ డాక్టర్. ఏ.మహేష్, డాక్టర్ సి.మనోహర్ గాంధీ, డాక్టర్. మౌనిక, డాక్టర్ పి.గిరిధర్, కన్సల్టెంట్ పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ హరిప్రసాద్, సిటిసర్జన్ డా. సందీప్‌రెడ్డి, అనస్థీషి యాలజిస్ట్ డా. రవిశంకర్ మంగళవారం ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తాడిపత్రికి చెందిన మూడేళ్ల బాలుడు న్యుమోనియాతో బాధపడుతుండగా తల్లిదండ్రులు కిమ్స్ సవీరా ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు బాలుడికి న్యుమోనియాతో పాటు ఎడమ ఊపిరితిత్తి చుట్టూ చీము చేరినట్లు గుర్తించి ముందుగా వీడియో అసిస్టెడ్ థొరకోస్కోపీ(వాట్స్) ప్రొసీజర్ చేశారు. ఆ తర్వాత అవసరమైన మరో శస్త్రచికిత్స చేసి ఊపిరితిత్తులు, గుండె పనితీరును మెరుగుపరచి ప్రాణాలు కాపాడారు. న్యుమోనియా చలికాలంలో వచ్చే సమస్య, వస్తే వెంటనే తగిన చికిత్స తీసుకోవాలి, ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని వైద్యులు సూచించారు. అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి చిన్న పిల్లలకు ఎలాంటి సమస్య ఉన్నా సమర్థవంతగా ఎదుర్కోవడానికి అంతర్జాతీయ స్థాయి అనుభవం కలిగిన ఎన్ఐసియు, పిఐసియు సేవలు కిమ్స్ సవీర హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వారితో పాటు హాస్పిటల్ సీఈఓ శ్రీనివాస్ ప్రసాద్, ఎంఎస్, డా. హబీబ్ రాజా, సీఓఓ సిద్దారెడ్డి ఉన్నారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళ వారం పోలీసు సురక్షా వాహనం ద్వారా విద్యార్థులకు గంజాయి, పొగాకు, మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్పరిమాలను వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పట్టణ డీఎస్పీ పి.రవిబాబు మాట్లాడుతూ మీ జీవితాలు ఆనందంగా ఉండాలంటే మంచి చదువుతోపాటు మంచి ఆరోగ్యకరమైన అలవాట్లు, మంచి మిత్రులను కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ పి.సూర్యనారాయణరెడ్డి, ఎన్ ఎస్–ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.రవిశంకర్. ఎన్ఎస్–ఎస్ ప్రోగ్రామ్ డాక్టర్ కె.శ్రీధర్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని వైద్యాధికారి రాజేష్ కుమార్ సూచించారు. జాతీయ పొగాకు నియంత్రణ, ఆశా డే కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిఎ పిహెచ్‌సిలో వైద్య సిబ్బందితో పొగాకు వినియో గానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఆశా కార్యకర్తలు హనుమక్క, తిప్పమ్మలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అఫ్తాబ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాణి ఎస్తేర్, సూపర్వైజర్ రామలక్ష్మమ్మ, హెల్త్ అసిస్టెంట్ జాన్సన్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

బ్రహ్మ సముద్రం : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని పిల్లలపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థిని పి.హేమశ్రీ ఎంపికైనట్లు హెచ్‌ఎం బసవరాజు, పిఇటి జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. హేమశ్రీని మంగళవారం పాఠశాలలో సన్మానించారు. వారు మాట్లాడుతూ గత సోమవారం అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి ఎపి స్కూల్ గేమ్స్ అండర్–14 అథ్లెటిక్స్‌లో 8వ తరగతి విద్యార్థిని పి.హేమశ్రీ డిస్కస్ త్రోలో ప్రథమ స్థానంలో నిలిచి శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. హేమశ్రీ రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థిని హేమశ్రీతో పిల్లలపల్లి ఉపాధ్యాయ బృందం

పుట్లూరు : స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఓ.నాగేష్, ఆర్.నరేష్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పిఇటి శ్రీనివాసరావు తెలిపారు. వీరు ఇటీవల అనంతపురంలో జరిగిన కురాష్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపారు. వారిని ఎంఇఒలు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్, హెచ్‌ఎం మల్లికార్జున యాదవ్ అభినందించారు.



రాష్ట్ర స్థాయికి ఎంపికైన పుట్లూరు పాఠశాల విద్యార్థులు

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

కూటమి ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ప్రక్రియను ఆపాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మంగళ వారం స్థానిక అనంతసాగర్ కాలనీలో ఆ పార్టీ మండల అధ్యక్షులు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నడపాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచి వరలక్ష్మి, రాజా, శేషానందరెడ్డి, రాజారెడ్డి, కప్పల సూరి, ముత్యాల శ్రీనివాసులు, ఆది, ఆదినారాయణ, కాటమయ్య, భాస్కర్‌రెడ్డి, కుళ్లాయమ్మ, పవన్‌సాయి, నారాయణరెడ్డి, మారుతి, సత్తి, పాల్గొన్నారు.

6న అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పుట్లూరు

అరటి ఆధారిత ఉత్పత్తుల తయారీ యూనిట్ల ఏర్పాటుపై ఈ నెల 6వ తేదీ అనంతపురం నగర శివారులోని రాప్తాడు సమీపంలో ఉన్న టిటిడిసి వద్ద అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎపిఎం వెంకటరామిరెడ్డి తెలిపారు. పుట్లూరు మండలంలో అరటి సాగు ఎక్కువగా ఉందని, అరటి పంట తర్వాత వేస్ట్‌గా తీసి వేస్తున్న భాగాల నుంచి దాదాపు 12 రకాల ఉత్పత్తులు తయారు చేసి మార్కెట్ చేయవచ్చన్నారు. యూనిట్ ఏర్పాటుకయ్యే పెట్టుబడి కోసం 50 శాతం రాయితీతో రుణ సౌకర్యం కల్పిసారన్నారు. ఆసక్తి ఉన్న యువతీ, యువకులు, ఎస్‌హెచ్‌జి సభ్యులు వెలుగు సిబ్బందిని సంప్రదించాలన్నారు.

మట్టి పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులు మంచి క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యనభ్యశించి భవిష్యత్తులో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులుగా మారి ప్రజలకు సేవలు అందించాలని భూసార పరీక్ష కేంద్రం ఏవో పి.శ్రీనాథ్‌రెడ్డి సూచించారు. సాయిల్ హెల్త్ ప్రోగ్రాం లో భాగంగా మంగళవారం అనంతపురం రూరల్ మండలం ఇటుకులపల్లిలో ఉన్న కేంద్రీయ విద్యాలయలో 7, 8, 9వ తరగతి విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సాయిల్ శాంపిల్స్ ఎలా తీయాలి, సాయిల్ శాంపిల్ టెస్ట్, జనరేషన్ ఆఫ్ సాయిల్ హెల్త్ కార్డ్స్ ప్రాముఖ్యత గురించి వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా రైతులు మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం అధికారిణి నివేదిత, స్కూల్ ప్రిన్సిపల్, సైన్స్ టీచర్స్, ఎంపిఇఒ నళినాక్షి, విద్యార్థులు పాల్గొన్నారు.

దోబిఘాట్ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలో రజకుల కోసం దోబిఘాట్ ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం ఎపి రజక సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ ఎంకె. సూర్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. రజక సంఘం నాయకుడు వై.రామాంజనేయులు మాట్లాడుతూ పట్టణంలో 270 రజక కుటుంబాలు ఉన్నాయన్నారు. కుల వృత్తినే నమ్ముకున్న పలువురు దుస్తులను ఉతికేందుకు దోబిఘాట్ లేక అవస్థలు పడుతున్నారన్నారు. సుమారు 5 కిలోమీటర్లు దుస్తుల మూటలు మోసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రజకుల జీవనాధారం కోసం దోబిఘాట్, దుస్తులు ఆరవేసేందుకు స్థలం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వై.హరిబాబు, సి.ఆదినారాయణ, శ్రీనివాసులు, సి.రాము, సుంకన్న, సుధీర్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అంజనప్రసాద్



గుత్తి : ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పట్టణానికి చెందిన అంజనప్రసాద్ ఎన్నికయ్యారు. ఈయన గతంలో జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. అంజనప్రసాద్‌కు ఎమ్మార్పీఎస్ నాయ కులు, కార్యకర్తలు, బంధువులు, స్నేహితులు అభినం దనలు తెలిపారు. అంజన ప్రసాద్ మాట్లాడుతూ నా జాతి ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు సువర్ణరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

హైస్కూల్‌కు ఎలక్ట్రికల్ బెల్ వితరణ

శింగనమల : స్థానిక జడ్పీ హైస్కూల్‌కు మంగళవారం 1987–88 బ్యాచ్ పదో తరగతి విద్యార్థి జెల్లి సుధాకర్ యాదవ్ రూ. 6వేల విలువ చేసే ఎలక్ట్రికల్ బెల్ అందజేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు చదివిన ఆర్.మునెప్ప. రామకృష్ణారెడ్డి, బెస్త నాగరాజు, హరి, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు త్యాగరాజు, గోపాలకృష్ణ ఉన్నారు.

ఆవులు రోడ్లపైకి వస్తే చర్యలు

గుత్తి : ఆవులు రహదారులపై సంచరిస్తే గోశాలకు తరలిస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా హెచ్చరించారు. మున్సిపాలిటీలోని గుత్తి ఆర్ఎస్‌లో రోడ్లపై సంచరిస్తున్న ఆవులను మంగళవారం మున్సిపల్ అధికారులు పట్టుకొని డివిజన్ కార్యాలయానికి తరలించారు. ఆవుల యజమానులను పిలిపించి మాట్లాడారు. ఆవులను నిర్లక్ష్యంగా వదిలేస్తుండడంతో అవి రహదారులపై సంచరిస్తూ ప్రమాదాలకు కారణం అవుతున్నాయన్నారు. కావున యజమానులు సొంత సురక్షిత ప్రాంతాల్లోకి ఆవులను తరలించుకోవాలన్నారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

యాడికి : విష జ్వరాలపై ప్రజలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ దేవరాజన్ సూచించారు. మండలంలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ దేవరాజన్ ఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. దేవరాజ్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. జ్వర పీడితులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రక్త పూతలు తీసి పిహెచ్‌సి ల్యాబ్‌కి అందించాలని సూచించారు. మహిళలకు నోటి, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేయించాలని, ఇంటింటికీ వెళ్లి స్పర్శ లేని మచ్చలను పరిశీలించే కార్యక్రమం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు, షబ్బీర్ ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు

పారిశుధ్యం మెరుగుపరచాలి

యాడికి : గ్రామాల్లో పారిశుధ్యం మరింత మెరుగవ్వాలని జిల్లా పరిషత్ సీఈవో శివశంకర్ సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులు, డంపింగ్ యార్డ్‌లను పరిశీలించారు. వేములపాడు, రాయలచెరువు, చిక్కేపల్లి, యాడికి గ్రామపంచాయతీలను సందర్శించారు. అధికారులు, సిబ్బందితో సమావేశమై గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపిడిఒ వీర్రాజు, ఎపిఒ మద్దిలేటి ఉన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

పామిడి : ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, సిపిఎం మండల ఇన్‌ఛార్జి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆశా డే సందర్భంగా మంగళవారం మండలంలోని ఎద్దులపల్లి పిహెచ్‌సి సమావేశ భవనంలో ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు నాగమణి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పని భారం తగ్గించాలని, వేతనం పెంచాలని, తక్షణమే 4–జి మొబైల్ అందించాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు, సిబ్బంది, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగమణి